క్లుప్తంగా

కేసీ కాలువను పునరుద్ధరించండి



కేసీ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ, అధికారులు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని వెంచర్ నిర్మాణం సందర్భంగా డైవర్షన్ చేసిన కేసీ కాలువను తిరిగి యథాస్థితిలో పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అఖిలప్రియ అధికారులను ఆదేశించారు. కేసీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే కాలువను పరిశీలించారు. త్వరలో కెనాల్‌కు నీరు రానున్న నేపథ్యంలో పంట పొలాలకు పూర్తి స్థాయిలో నీరందేలా చూడాలన్నారు.

ఏకలవ్యుడి జయంతి



ఏకలవ్వుడి చిత్ర పటానికి పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల అర్బన్: మహాభారతంలో గురుభక్తికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఏకలవ్యుడు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌జీఓస్ కాలనీ ఏపీ ఎరుకల సంస్థ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర చైర్మన్ సుబ్బరాయుడు, అధ్యక్షుడు సుబ్బారావు ఏకలవ్యుని చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏకలవ్యుడి అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన

బొమ్మలసత్రం: జిల్లా ప్రజలు, వైద్య సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని జిల్లా లెప్రసీ మరియు ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ శారదాబాయి పేర్కొన్నారు. జులై 18 నుంచి ఆగస్టు 2 వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపియన్ ద్వారా 16 రోజుల పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటి ంటికి తిరిగి పరీక్షలు జరుపుతారన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి తక్షణమే అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు, హాస్టళ్లలో ఉండే పిల్లలకు కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించనున్నట్లు బుధవారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న దస్తగిరి

నంద్యాల అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను వెంటనే రద్దు చేయాలని పీఆర్‌టీయూ నంద్యాల మండల అధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకుల సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ ఈ యేడాది ఏప్రిల్ మాసం నుంచి మెడికల్ రీయంబర్స్‌మెంట్ అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్ రెడ్డి, విజయరావు, జగదీశ్, విశ్వనాథ్, ఆనందప్ప, శివనాగిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కలు నాటుతున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడదామని నంది పైపుల అధినేత్రి సుజల పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఎస్వీవై రెడ్డి టౌన్‌షిప్, ఎస్బీసీ రోడ్ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటి దాన్ని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా చెట్లను పెంచాలన్నారు. ముందు తాము మరిన్ని సమాజహిత కార్యక్రమాలు చేపడతామన్నారు.

గో సంరక్షణనిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి బుధవారం నెల్లూరుకు చెందిన పి.శివకృష్ణ కుటుంబం రూ.1,00,016 విరాళాన్ని ఏఈఓ జి.స్వాములకు అందజేశారు.ఈ సందర్భంగా దాతను దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డు ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు.



రుద్రవరం.. గ్రామోత్సవంలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు



ఆళ్లగడ్డ పట్టణంలో జన సందోహం మధ్య ఊరేగుతున్న పీర్లు



శిరివెళ్ల..నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు



చాగలమర్రి.. అశేష భక్తజనం మధ్య శ్రీలాల్‌స్వామి సరిగెత్తు

ఉప్పొంగిన భక్తిభావం

- మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం వేడుకలు
- పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు, ఊరేగింపు
- నిమజ్జనంతో ముగిసిన పండుగ
- అలరించిన యువకుల వేషధారణలు
- చాగలమర్రిలో దివిటీల వెలుగులో సాగిన లాల్‌స్వామి పీరు ఊరేగింపు



ఉయ్యాలవాడ.. నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు



చాగలమర్రి..గుండంలో కొబ్బెరి గిన్నెలు వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఉయ్యాలవాడ.. పీర్ల ఊరేగింపులో యువకుల విన్యాసాలు

చాగలమర్రి: హిందూ ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో 9 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఈ వేడుకలు జరిగాయి. పీర్ల ఊరేగింపులో యువకులు వివిధ రకాల వేషధారణలు వేసి అలరించారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా పేరుగాంచిన మండలకేంద్రం చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో కొలువు దీరిన శ్రీలాల్‌స్వామి పీరును దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి దివిటీల వెలుగులో పెద్ద సరిగెత్తు ప్రారంభమై బుధవారం తెల్లవారుజాము వరకు సాగింది. చిన్నమకానం నుంచి మొదలైన స్వామి ఊరేగింపు గ్రామంలోని అరబ్ మసీద్, పోలీస్‌స్టేషన్ వద్దనున్న ఇమాం హుసేన్ మకానం, శ్రీహూరే షహీద్ మకానం వరకు అక్కడి నుంచి మెయిన్ బజార్, గాంధీసెంటర్ల మీదుగా తిరిగి చిన్న మకానం వరకు సాగింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయా ప్రాంతాల మీదుగానే చిన్న సరిగెత్తు నిర్వహించారు. మార్గమధ్యంలో భక్తులు స్వామికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండు రోజుల పాటు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ముల్లా జిలానీ బాషా, ముల్లా షబ్బీర్, కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి ముల్లా రఫీ, సభ్యులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ రమణయ్య బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీర్ల నిమజ్జనం

గోస్పాడు: మండలంలోని ఒంటివెలగల, పసురపాడు, యాళ్లూరు, జూలే పల్లె, కానాలపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. చిన్న, మధ్య, పెద్ద సరిగెత్తుల కార్యక్రమాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్ల నిమజ్జనం కార్యక్రమం జరిపారు.

ఆళ్లగడ్డ: మండలంలోని చావిళ్లలో కొలువైన పీర్లను ప్రత్యేకంగా అలంకరించి జన సందోహం మధ్య ఊరేగించారు. కులమతాలకు అతీతంగా పీర్ల ను దర్శించుకున్నారు.తర్వాత పీర్లను నిమజ్జనం చేశారు.

రుద్రవరం: మండల కేంద్ర రుద్రవరంతో పాటు అప్పనపల్లె, తువ్వ పల్లె, ఆలమూరు, కొండమాయపల్లె తదితర గ్రామాల్లో వెలసిన పీర్లను బుధవారం ఏటికి తీసుకెళ్లారు.అంతకు ముందు ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కాగా మండలంలోని ఆర్.నాగులవరం, ఎల్లావత్తుల, శ్రీరంగాపురం, కోకొండ తదితర గ్రామాల్లో గురువారం మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

దొర్నిపాడు: మండలంలోని పలు గ్రామాల చావిళ్లలో కొలువైన పీర్లకు ఫాతెహాలు సమర్పించి ఊరేగించారు. దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజు వేముల, బుర్రారెడ్డిపల్లె, గుండుపాపల డబ్ల్యూ. కొత్తపల్లె గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

శిరివెళ్ల: మండలంలో మూడు రోజుల పాటు పూజలందుకున్న పీర్లను శిరివెళ్ల, యర్రగుంట్ల, బోయలకుంట్ల, మహదేవపురం, వనికినిదిన్నె, జీనేపల్లె గ్రామాల్లో బుధవారం ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సురేష్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉయ్యాలవాడ: మండలంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. ఈ నెల 8న మండల కేంద్రం ఉయ్యాలవాడతో పాటు అల్లూరు, హరివరం, పడిగెపాడు, రూపనగుడి, ఆర్.పాంపల్లె, మాయలూరు, బోడెమ్మనూరు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను ప్రత్యేకంగా అలంకరించి సరిగెత్తులు నిర్వహించారు. చివరి రోజు బుధవారం సాయంత్రం పీర్లను కుందూనదిలో నిమజ్జనం చేశారు.



నంద్యాల కల్పనా సెంటర్‌లో బీబీ ఫాతిమా పీరును ఊరేగిస్తున్న భక్తులు

నంద్యాల పట్టణంలో..

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దాదాపు 25 కు పైగా పీర్ల మకాన్‌లు ఏర్పాటు చేసుకొని భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం సాయంత్రం శోకగీతాలు ఆలపిస్తూ పీర్ల నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కల్పనా సెంటర్‌లోని ఇమామ్‌కాశీం, చాంద్‌బాడలో అలీఅక్బార్, ఇమామ్‌కాశీం, అలీఅబ్బాస్, మాల్దారిపేటలో మౌలాలిస్వామి, తొట్టిబావి వద్ద ఉన్న ఉజాలాతాబుచ్, గాంధీచౌక్‌లో హసన్, జమాల్ బాషా దర్గా వద్ద ఉన్న అలీఅక్బర్, అలీఅక్బర్, బాదుల్ సాహెబ్, సాధిక్‌నగర్‌లోని అలీఅక్బార్, హసన్ హలీమ్, నూనెపల్లెలోని మౌలాలిస్వామి, ఏకలవ్యనగర్‌లోని దస్తగిరిస్వాములు బయల్దేరారు. ముజావర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ఫాతెహాలు నిర్వహించారు. యువకులు గంధం చల్లుకుంటూ మాతం నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కుందూనది వద్ద స్వామి వారి పీర్లను నిమజ్జనం(షాహదత్) చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్‌రాణా ఆదేశాల మేరకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నంద్యాల అర్బన్: పీర్ల నిమజ్జనాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం అనేక గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో పెద్దస్వామి, హుసేన్ స్వామి పీర్లను స్థానిక శెట్టిగారి బావిలో నిమజ్జనం చేశారు. చాపిరేవుల గ్రామంలో మాత్రం అలీఅక్బర్, హుసేన్, మౌలాలి స్వామివార్ల పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు మొక్కులు చెల్లించుకొని స్వామి ఆశీర్వాదాలు పొందారు.



నంద్యాల గాంధీచౌక్‌లో హసన్ అలీ పీర్ల ఊరేగింపు

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు





సంజీవనగర్ రామాలయంలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు, గాంధీచౌక్ శ్రీకృష్ణ భజన మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

నంద్యాల వ్యవసాయం: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలను బుధవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భక్తులు మంగళ స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామి వారికి నైవేద్యంగా వడపప్పు, పానకం, ప్యాలాపిండి వంటివి సమర్పించారు. తులసి చెట్టుకు, గోవుకు పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షతో రాత్రి విష్ణు సమస్ర నామావళిలు, జపాలు, పారాయణం గావిస్తూ జాగారణలు చేశారు.

- నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామికి తొలి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాసులు, సముద్రాల సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.
- గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేదపండితులు కృష్ణమాచారి, వరదాచారి ఆధ్వర్యంలో స్వామి వార్లకు ఉదయమే పంచామృతాభిషేకాలు, సుప్రభాతసేవ, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.
- పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరం, గాంధీ చౌక్‌లోని శ్రీకృష్ణ భజన మందిరంలో స్వామి వారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, స్నపన మందిర సేవలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.
- కాళికాంబ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు పుట్టింటి పట్టుచీర, సారెను సమర్పించి ఒడి బియ్యం పోశారు.
- రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయం, కోటవీధిలో రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, చైర్మన్ యాడికి శ్రీదేవి పాల్గొన్నారు.
- నాగులకుంట రోడ్డులోని షిర్డీసాయిబాబా దేవస్థానంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు, హారుతులు ఇచ్చారు.
- గోస్పాడు మండలంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణమందిరం, రామాలయాల్లో భజనలు, విష్ణుసహస్ర నామాలు, పారాయణాలు నిర్వహించారు.

రుద్రవరం: తొలి ఏకదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రజలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాదిలో హిందువులకు తొలి పండుగ కావడంతో కుటుంబ సమేతంగా అందుబాటులో ఉన్న ఆలయాలకు వెళ్లారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంగుల మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ కార్యక్రమం జరిగింది. వేద పండితులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: తొలి ఏకాదశిని మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందువులు వేకువ జామునే లేచి పుణ్యస్నానాలు చేసి శ్రీమహావిష్ణు, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిండివంటలతో స్వామి వార్లకు నైవేద్యం సమర్పించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు అనంతయ్య, రమణయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, సుప్రభాతసేవ, తిరమంజనసేవ, మహామంగళహారతి, తదితర పూజలు నిర్వహించారు.



రుద్రవరం.. ఎర్రగుడిదిన్నెలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ.. ఇంజేడులో లక్ష్మీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మాన్యం భూముల వేలం



హరివరంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామంలో వెలిసిన శ్రీ వినాయక, జనార్ధన స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన 90 ఎకరాల మాన్యం భూముల కౌలుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ చంద్రుడు మాట్లాడుతూ ఈ ఏడాది మాన్యం భూములకు రూ. 16.80 లక్షలకు వేలం పాడినట్లు తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ. 3.30 లక్షలు అధికమని చెప్పారు. వేలం పాటలో హరివరం, నర్సిపల్లె గ్రామాలకు చెందిన రైతులు పోటీపడ్డారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రఘురాం, ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి, గ్రామ పెద్దలు అంబటి నారాయణరెడ్డి, గండా వెంకటరామసుబ్బారెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, పల్లె మహేశ్వర రెడ్డి, అంబటి శివారెడ్డి, ఎర్రి వెంకటస్వామిరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల అర్బన్: వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమం కింద బుధవారం నంద్యాల మండలం అయ్యలూరు, కానాల, చాబోలు, బిల్లలాపురం గ్రామాల్లో పోషణ లోపం కలిగిన 40 మంది చిన్నారులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. నంద్యాల అర్బన్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ ఇండియా పీఓ తిరుపతి రావు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వార చిన్నారుల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, సూపర్ వైజర్ విజయ, టెక్ట్ కంప్యూటర్స్ అధినేత రామారావు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాయనం ఆరంభం

శ్రీశైలం: సూర్యుడు మకరరాశి నుంచి కర్కాటక రాశిలో ప్రవేశించాడు. సాయన, నిరయన, పద్ధతులతో సూర్య గమనాన్ని డిగ్రీలలో కొలుస్తారు. ఈ కాలంలో పగలు తక్కువ, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుంచి సూర్యుడు 91వ డిగ్రీల నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తాడు. క్రమంగా ఉత్తరం వైపు నుంచి భూమధ్య రేఖ వైపు కదులుతూ సెప్టెంబరు 23 నాటికి భూమధ్య రేఖ పైకి చేరుకుంటాడు. ఆ రోజు పగలు రాత్రి సమానంగా ఉంటాయి. అక్కడి నుంచి మకరరాశి వైపు కిందకి పయనిస్తాడు. ఈ నెల 16వ తేదీ నుంచి 6 నెలల పాటు సూర్యుడు దక్షిణం వైపునకు కదులుతాడు. నిర్ణయ సింధువు అనే గ్రంథంలో గాలవుడు అనే ప్రసిద్ధ పండితుడు సాయన సంక్రాంతిని కూడా పుణ్యకాలంగా చెప్పారు. 180 డిగ్రీల వద్ద శరద్రుతువు, 270 డిగ్రీల వద్ద ఉత్తరాయణం ఆరంభం అవుతుంది.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి నటరాజు అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు.కార్యక్రమంలో వినాయకకౌత్వం, తాండవ నృత్యకరి, శివపంచాక్షరి, అఖిలాండేశ్వరి, అష్టలక్ష్మీ స్తోత్రం, శివతాండవం తదితర గీతాలు, అష్టకాలకు నృత్యం చేశారు.

20న శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లకు ఈ నెల 20వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నారు. పౌర్ణమి రోజున సంప్రదాయబద్ధంగా శ్రీశైల గిరిప్రదక్షిణ, భ్రమరాంబా దేవికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపించనున్నారు.

వైభవంగా పాండురంగస్వామి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రంగరాజు వీధిలో శ్రీరుక్మిణి పాండురంగస్వామి కల్యాణోత్సవం బుధవారం అంగరంగా వైభవంగా జరిగింది. తొలి ఏకాదశిని పురస్కరించుకుని భావసార్ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయన్నే స్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి పట్టు వస్త్రాలతో భక్తులకు దర్శనం కల్పించారు. వేదపండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం జరిపారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా రథోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భావసార్ క్షత్రియ సంఘం అధ్యక్షుడు షణ్ముకరావు, రమేష్‌రావు, కార్యదర్శి కృష్ణారావు, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.



రుక్మిణి పాండురంగస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు



స్వామి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు